క్లుప్తంగా

కొండమల్లీశ్వరుడికి పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కం డ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సరదాగా సమ్మర్ క్యాంప్


కృత్యాలను వివరిస్తున్న హెచ్ఎం కుప్పరాజు

నగరి : ప్రభుత్వం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సెలవుల్లో సరదాగా క్యాంపులో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాంపు నిర్వహణకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా రూపొందించిన పుస్తకం ఉపయోగించి స్థానిక దక్షిణం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత కృత్యాలు చేయిస్తున్నారు. పుస్తకంలోని సామెతలు, పొడుపు కథలు, పదసంపద, మైండ్ మ్యాపింగ్, కథలు, సంభాషణలు, ఆలోచించండి-అర్థం చేసుకోండి గణిత కృత్యాలు, వర్క్ షీట్లు, ఫన్ క్యాలెండర్ లాంటివి విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందిస్తాయని హెచ్ఎం కుప్పరాజు తెలిపారు. ప్రాథమికస్థాయి విద్యార్థులు కూడా ఇలాంటి సమ్మర్ క్యాంపు నిర్వహణ వల్ల నేర్చుకున్న అంశాలను గుర్తుంచుకుంటారని తెలిపారు

ఇష్టంతో పని చేస్తే విజయం తథ్యం


అవగాహన కల్పిస్తున్న పినాకా నిర్వాహకులు యాదగిరి

నగరి : లక్ష్యసాధనకు ఇష్టంతో పనిచేస్తే విజయం తథ్యం అని పినాకా నిర్వాహకులు బి.యాదగిరి ఐఆర్ఎస్ అన్నారు. నగరి పట్టణంలో పినాకా ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతులకు హాజరైన వారితో మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు, లక్ష్యాల ఎంపికపై అవగాహన కల్పించారు. కేర్‌గైడెన్స్, సివిల్ సర్వీస్ పరీక్షల మీద సమగ్రంగా వివరించారు. ఏ విధంగా లక్ష్యాలను సాధించాలో అభ్యర్థులకు ఉదాహరణలతో వివరించి ఉత్తేజ పరిచారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధనకు ఇష్టంతో పనిచేస్తే కచ్చితంగా విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు మునస్వామి, బాలాజీ, జనార్దన్‌బాబు పాల్గొన్నారు.

బైపీసీ, సీఈసీ కోర్సుల్లో చేరేందుకు అవకాశం


విధులకు హాజరైన ఉపాధ్యాయులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ప్రారంభమైందని, ఇందులో బైపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు హెచ్ఎం గాయత్రీదేవీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభజ్ఞులైన 9 మంది అధ్యాపకులు విద్యాబోధన చేస్తారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని సూచించారు.

తప్పిన పెను ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

శ్రీరంగరాజపురం : మండలంలోని పెద్దతయ్యూరు వద్ద నిద్ర మత్తులో అతి వేగంగా కారు దూసుకువచ్చింది. అయితే ఈ ప్రమాదంలో స్కూటర్, హెరిటేజ్ పార్లర్, నర్సరీ ధ్వంసమైంది. స్థానికుల కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం ఎస్.ఎస్.కొండకు చెందిన నాగేష్ (40) పుత్తూరు నుంచి చిత్తూరు వైపు అతివేగంగా కారు దూసుకొచ్చింది. పెద్ద తయ్యూరు గ్రామం వద్ద హెరిటేజ్ పార్లర్, నర్సరీ, స్కూటర్ ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో చిరంజీవి, ధనుష్‌కు తీవ్రగాయాలు కావడంతో వెంటనే స్థానికుల సహకారంతో చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రీడాసంబరానికి సిద్ధం

బడి తలుపులు మూసివేసిన వేళ మైదానం నుంచి పిల్లలకు పిలుపు అందుతోంది. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాసి సెలవుల్లో ఉన్న విద్యార్థులు శారీరకంగా, మానసికంగాను దృఢపడేందుకు ప్రభుత్వం వేసవి శిక్షణా శిబిరాలను అందుబాటులోకి తెస్తోంది. ఈనెల 24 నుంచి నగరిలో అధికారులు సమ్మర్‌క్యాంపు ప్రారంభిస్తున్నారు.

- క్రీడా శిక్షణకు సిద్ధమవుతున్న శిబిరాలు
- 24న సమ్మర్ క్యాంపును ప్రారంభించనున్న క్రీడాశాఖ మంత్రి రోజా


సిద్ధం చేసిన బాల్‌బ్యాడ్మింటన్ కోర్టు

నగరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు, శాప్ సూచనలతో ఈ ఏడాది కూడా పకడ్బందీగా సమ్మర్ క్యాంపులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా శిక్షణా శిబిరాలను సిద్ధం చేస్తుండగా నగరిలో ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద ఉన్న కేవీకే మైదానం సిద్ధమవుతోంది. ప్రభుత్వ సహకారంతో పాటు క్రీడాభివృద్ధికి తన సహకారాన్ని ఎల్లప్పుడూ అందించే మంత్రి ఆర్కేరోజా ప్రత్యేక చొరవ తీసుకుని వేసవి శిబిరాలను ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నారు. దీంతో క్రీడాకారులకు క్రీడల్లో రాణించేందుకు సువర్ణావకాశం లభించింది. ఈ క్రీడా శిబిరాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమై జూన్ 7వరకు కొనసాగుతాయి. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో ఈ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే 47 శిక్షణా శిబిరాలు శిక్షణకు సిద్ధమయ్యాయి. శిక్షణ సమయంలో క్రీడాకారులకు పోటీలను నిర్వహించి, ఆఖరిలో సర్టిఫికెట్లను అందజేస్తారు.

విధివిధానాలు..

- సమ్మర్ కోచింగ్ క్యాంపులో 8-16 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ అందిస్తారు. 16 ఏళ్ల పైబడి, ఆసక్తి కలిగిన వారు కూడా హాజరు కావచ్చు.
- ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 వరకు, అనంతరం సాయంత్రం 5 నుంచి 7 వరకు శిక్షణను అందిస్తారు.
- శాప్ కోచ్‌లతో పాటు పీడీలు/పీఈటీలు, నేషనల్ ప్లేయర్స్, సీనియర్స్ ప్లేయర్స్ వారివారి క్రీడాంశాల్లో శిక్షణను అందించేందుకు అర్హులు
- నెలరోజుల శిక్షణా శిబిరంలో వారాంతంలో పోటీలు నిర్వహించి ప్రోత్సాహం అందిస్తారు.
- దాతల సహకారంతో శిక్షణా శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలకు క్రీడాపరికరాలు, బహుమతులు అందించేలా ఆయా కేంద్రాల శిక్షకులు చొరవ తీసుకుంటున్నారు.


క్రికెట్ ప్రాక్టీస్ కోసం ఏర్పాటు చేసిన నెట్


హ్యాండ్ బాల్ ఆటకు సిద్ధం చేసిన కోర్టు

గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత..



క్రీడా శాఖ సహకారంతో జిల్లాలో సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా ఒక్కో శిబిరంలో కొన్ని క్రీడల చొప్పున వాలీబాల్, సాఫ్ట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, తైక్వాండో, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, ఖోఖో, ఫుట్‌బాల్, బేస్‌బాల్, బాక్సింగ్, జూడో, బాస్కెట్ బాల్ , నెట్‌బాల్, టెన్నికాయిట్ క్రీడలకు సంబంధించి శిబిరాలను ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లు, కళాశాలల మైదానాల్లోనే శిక్షణ అందించడం జరుగుతుంది. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- మురళీకృష్ణారెడ్డి, సెట్విన్ సీఈఓ

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నిర్దేశించిన 30 క్రీడల్లో వేసవి శిబిరాల ద్వారా ఉచిత శిక్షణ అందించడం జరుగుతుంది. ప్రతి క్రీడలో నిష్ణాతులైన కోచ్‌ల ద్వారా శిక్షణ అందిస్తాం. క్రీడాకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన సామగ్రిని అందించి నిర్వహిస్తున్న ఈ శిక్షణా శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

\- బాలాజీ, చీఫ్ కోచ్, సెట్విన్

అర్హత ఉంటే చాలు పథకాలు ఇస్తున్నాం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాల్లో భాగంగా ప్రతి పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమ వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కొత్రకోన, కొత్రకోన దళితవాడ, లక్ష్మీరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పథకాన్ని కూడా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని తెలిపారు. ప్రజల వద్దకు ప్రభుత్వ అధికారులు వెళ్లాలన్న ఉద్దేశంతో గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాలను మండల కేంద్రాలు తీర్చిదిద్దిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ గ్రామాలకు శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులే రాష్ట్రానికి వెన్నుముఖ లాంటి వారని వ్యవసాయ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సీఎం జగనన్న రైతు పక్షపాతిగా రైతులకు రైతుభరోసా వంటి పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న నిత్యం పని చేస్తున్నారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని లబ్దిదారులను కోరారు. ఎన్నడూ లేనివిధంగా సంక్షేమాలతో ప్రతి ఇంటికీ లక్షల రూపాయలు లబ్ధి చేకూర్చిన ఘనత కూడా జగనన్నదేనని అన్నారు. అలాగే పేదల కోసం విద్య, వైద్యానికి పెద్దపీట వేసి పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా కొత్రకోన గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, వేల్కూరు నుంచి దొడ్డిపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని, పాతశివాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని కోరడంతో స్పందించిన మంత్రి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతుల అభ్యర్థన మేరకు మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఫోన్‌లో కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే కొత్రకోన గ్రామానికి చెందిన పద్మావతమ్మ(86) మాట్లాడుతూ తనకు వచ్చే పింఛన్, సంక్షేమ పథకాలను రద్దు చేసి పేదలకు అందించండి అని డిప్యూటీ సీఎంకు తెలిపారు. దీంతో మంత్రి ఆమెకు నమస్కరించి శాలువ కప్పి పద్మావతమ్మను సత్కరించి, ఆమెను మిగతా వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వర్షంలోనూ ప్రజల మధ్య డిప్యూటీ సీఎం

లక్ష్మీరెడ్డిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం సాయంత్ర ఆకస్మికంగా వర్షం కురుసింది. అయితే మంత్రి నారాయణస్వామి వర్షాన్ని లెక్క చేయకుండా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాషిణి, ఎంపీటీసీ జయంతి, వైస్ ఎంపీపీలు, బేబీ, హరిబాబు, మండల కనీ్వనర్ పూర్ణచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కుమార్‌నాయుడు, నాయకులు డిల్లీబాబురెడ్డి, శేఖర్, సుధాకర్‌రెడ్డి, బాలాజీ, సతీష్, షణ్ముగం, ఉమాపతి, చిన్ని, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఉన్నునాథన్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.


వర్షంలోనూ ప్రజలతో మమేకమవుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

జాబ్‌కార్డు తప్పనిసరిగా అందించండి


కృష్ణజమ్మపురంలో ఉపాధిహామీ పనుల మస్టర్ పరిశీలిస్తున్న ఏపీఓ అనూష

పాలసముద్రం : మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తప్పనిసరిగా జాబ్‌కార్డు అందించి వంద రోజులు పనులు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని ఇన్‌చార్జ్ ఏపీఓ అనూషా తెలిపారు. సోమవారం కృష్ణజమ్మపురం, ఆముదాల, బాలకృష్ణాపురం, నరసింహాపురం గ్రామ సచివాలయాల పరిధిలోని జరుగుతున్న ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీఓ అనూషా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారికి జాబ్‌కార్డుతో పాటు వందరోజులు పనులు కల్పిస్తామని తెలిపారు. సన్న, చిన్నకారుల రైతులకు ఉద్యానవన పంటల కు, మునగ, పండ్లతోటల పెంపకం మంజూరు చే స్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని తెలిపారు. మస్టర్లు కొట్టివేతలు లేకుండా కూలీల హాజరు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు సూచించారు. మస్టర్‌ని తరువుగా పరిశీలించి కూలీల పేరు చదివి వినిపించారు.

సమయపాలన పాటించండి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం ఆయన బాలకృష్ణాపురం, ఆముదాల గ్రామ సచివాలయాలను సందర్శించారు. అనంతరం ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రజల సమస్యలను సచివాలయ సిబ్బంది పరిష్కరించడానికి చొరవ చూపాలని సూచించారు. అలాగే విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించడంతో పాటు స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గృహనిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. లబ్దిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మధు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ సర్వర్ డౌన్

విజయపురం : ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్‌నెట్ అత్యంత కీలకం. అయితే సోమవారం ఇంటర్‌నెట్ సర్వర్ పని చేయకపోవడంతో మండల అధికారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనగా నెట్ పని చేయకపోవడంతో నింద్ర మండల కార్యాలయానికి వెళ్లారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 12 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన వినతులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువ ప్రతాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

కనకమ్మసత్రానికి అదనపు బస్సు

విజయపురం (నగరి) : నగరి నుంచి విజయపురం మీదుగా కనకమ్మసత్రానికి పుత్తూరు డిపో మేనేజర్ అదనపు ఆర్టీసీ బస్సు ప్రారంభించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. కరోనాకు ముందు విజయపురం మండలానికి మూడు బస్సులు నడిపేవారు. కరోనాలో ప్రయాణికులు తగ్గిపోవడంతో ఒక బస్సును తొలగించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బదులు పడ్డారు. ఇటీవల ప్రయాణికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు సోమవారం నుంచి అదనపు బస్సు వేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పులివెందుల తరహాలో జీడీనెల్లూరు అభివృద్ధి


సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని దత్తతకు తీసుకుని మరో పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గాజుల కండ్రిగ గ్రామానికి రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ లత, రాష్ట్ర మహిళా నాయకురాలు కృపాలక్ష్మి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత నియోజకవర్గాన్ని దత్తతకు తీసుకుని మారుమూల గ్రామాలకు కూడా రూ.కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో ఉన్న జగనన్నను మరోసారి ఆదరిస్తే మరెన్నో పథకాలను అందుకోవచ్చని గుర్తు చేశారు. అలాగే కార్వేటినగరం మండలానికి రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసి తన రుణాన్ని తీర్చుకున్నానని మంత్రి అన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేని గాజులకండ్రిగ గ్రామానికి రూ.70 లక్షలు మంజూరు చేసి రోడ్డును ఏర్పాటు చేయిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ధనుంజయవర్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయ్య, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓ మణి, కొండరాజు, నరసింహులు, పలువురు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం చొక్కమడుగు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితర వాటిని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం వ్యాధి నిరోధకశక్తిని ఇవ్వడంతో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డాక్టర్ సందీప్ రాజు, నర్స్ గంగాదేవి, కవిత, చంద్రకళ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జిరెడ్డి సేవలు మరువలేం


నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: సీనియర్ నాయకుడు బుజ్జిరెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేమని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. పుత్తూరు రూరల్ మండలం శిరుగురాజుపాళెం గ్రామానికి చెందిన బుజ్జిరెడ్డి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వెళ్లి బుజ్జిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తడుకు సింగిల్‌విండో ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులురెడ్డి, గ్రామ సర్పంచ్ మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి


వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ లత, మహిళా నాయకురాలు కృపాలక్ష్మి


కార్వేటినగరం: ప్రభుత్వ పనితీరుకు వలంటీర్లు వన్నె తెచ్చారని ఎంపీపీ లత అన్నారు. సోమవారం మండల పరిధిలోని డీఎంపురం, కొటార్వేడు సచి వాలయ పరిధిలోని పలువురు వలంటీర్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కుమార్తె కృపాలక్ష్మితో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల కన్నీళ్లు తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లి నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వతాతలకు పింఛన్లు అందిస్తూ ప్రభుత్వ పథకాలకు వన్నెతెచ్చి పెడుతున్న వలంటీర్ల వ్యవస్థకు ఎంత చేసినా రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. అనంతరం కృపాలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్ల బా ధ్యత తీసుకున్న వారంతా యువ సైనికుల్లా సేవా వారధుల్లా నూతనోత్సహంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం లబ్దిదారులు ఎదురు చూడకుండా వలంటీర్లే స్వచ్ఛంద వారి ఇళ్లకే వెళ్లి అర్హులైన వారిని గుర్తించి వారికి సేవలు అందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం సన్మానాలు, సత్కారాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సత్కారాలతో మా బాధ్యత మరింత పెరిగిందని, మరింత సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్‌లు శీలారాణి, తులసి, వెంకటేష్, ధనుంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు విమల, ఎంపీడీఓ మోహన్‌మురళి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్, ఈఓపీఆర్డీ లక్ష్మిపతి, చందురాజు పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన


ప్రభుత్వ స్కూల్లో చేర్పించేందుకు అడ్మిషన్ చేయిస్తున్న ఉపాధ్యాయ బృందం

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధనలతో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు సీఆర్పీ జగ్గారావు తెలిపారు. సోమవారం స్థానిక గేట్‌పుత్తూరులోని మండల పరిషత్ ఆంధ్ర కేసరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సీఆర్పీ, ఉపాధ్యాయులు ఒకటో తరగతిలో న్యూఅడ్మిషన్లు చేర్పించారు. ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ మురళి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులతో పాటు విద్యాబోధనల కారణంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితిని గుర్తించిన ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశులు, సీఆర్పీ జగ్గారావు, ఉపాధ్యాయులు శేఖర్ ఆచారి, మంజుల, సునీత, గోవిందమ్మ పాల్గొన్నారు.

చంద్రప్రభపై ఆదిదంపతుల కటాక్షం


చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తున్న శివపార్వతులు

- సదాశివేశ్వర ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- తొలిరోజు పురవీధుల్లో దర్శనమిచ్చిన శివపార్వతులు


ధ్వజారోహణంలో పండితులు

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే 7 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతనం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం అభిషేకాధి పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లు చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటింటా ప్రజలు కర్పూర హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు పర్యవేక్షించారు.